# మధురాంతకం నరేంద్ర — చోటు

"యిదో ముసిలాయినో! నా చోట్లోకి రావొద్దు. రోంత జరుగు. యీ పక్క నించీ నువ్వూ, ఆ పక్క నించీ ఆ సన్న పిల్లోడూ మోచేతలతో కుమ్మిపారేస్తాంటే నేనేమైపోవాల్లా?" అంటూ విసుగ్గా అరిచాడు మద్దులేటి.

మూరెడెత్తున్న పేవ్‌మెంట్ చివర్లో పాత న్యూస్ పేపరుపైన గొంతుక్కూచున్న ముసలాయన వులిక్కిపడి కళ్లు తెరిచి చూశాడు. మోకాళ్లపై పెట్టుకున్న పాత నల్లరంగు జిప్ బాగ్ పక్క పాకెట్టులోంచీ నీళ్ల బాటల్ పైకి తీసి గుటగుటా రెండు గుక్కల నీళ్లు తాగాడు. చేతిలోకి పుడిసెడు నీళ్లు తీసుకుని ముఖం కడుక్కున్నాడు.

నగరవు వీధుల్లో దారితప్పిన ఆగంతకుడిలాంటి పిల్ల తెమ్మెరొకటి మద్దులేటి శరీరాన్ని తాకుతూ పలకరించి, తల వెంట్రుకల్ని రేపుతూ కవ్వించి అలాఅలా సాగిపోయింది. ముంచుకొస్తున్న నిద్ర నుంచీ తప్పించుకోవడం కోసం కళ్లు నులుము కుంటూ వోసారి జెమినీ ఫ్లయ్ వోవర్ వైపుకు దృష్టిని సారించాడు అతను. నాలుగువైపులా రకరకా లుగా వంపులు తిరిగి సిమెంట్ బ్రిడ్జీతో అయిదారు మీటర్ల ఎత్తున్న జెమినీ ఫ్లయ్ వోవర్ టెంటికల్స్ చంపిన కాంక్రీటు అమీబాలా చిత్రంగా కని పిస్తోంది. దాదాపు రెండు మీటర్ల పొడవున్న అమెరికన్ కౌన్సిలేట్ జనరల్ భవనపు ప్రహరీ గోడ పొడవునా, రోడ్డు చివర పేవ్‌మెంట్ పైన కూర్చున్న మనుషుల క్యూ శరీరం నుంచీ తెగిపడిన బల్లిపిల్ల తోకలా నిస్సారంగా సోలిపోయి వుంది. చుట్టూ కనిపిస్తున్న భవన సముదాయాల ముందు దీపాల బారులు వెలుగుతున్నాయి. రోడ్డుపైన జనసంచారం లేదు. రుసరుసలూ గుసగుసలూ తప్ప మరో శబ్దం కూడా వినిపించడం లేదు. ఆకా శంలో తడబడుతూ తిరుగుతున్నట్టున్న చంద్రవంక వేలపైని విద్యుద్దీపాలతో పోటీ పడలేక వెలవె లబోతోంది. యెంబసీలోంచి రోడ్డుపైకి బారలు చాపిన చెట్ల కొమ్మలు క్యూలో కూర్చున్న మను షులను నిద్రలోకి జారిపోనివ్వకుండా మంచు బిందువుల్ని రాలుస్తూ కాపలా కాస్తున్నాయి. అక్క డక్కడా కొందరు న్యూస్ పేపర్లూ, టవళ్లూ, దుప్పట్లు లాంటివి పరచుకుని నిద్రతో కసరత్తులు చేస్తున్నారు.

రుమాలుతో ముఖం తుడుచుకుంటూ వోసారి నిట్టూర్చి "టయమెంతయింది బాబూ!" అని అడి గాడు ముసలాయన.

అటువైపు కూర్చున్న యిరవయ్యేళ్ల కుర్రాడు చేతి గడియారంకేసి చూసి "రెండుంకాలు..." అన్నాడు. తనవి గానట్టున్న లూజు లూజు టీ షర్టూ పాంటుల్లో క్రోటన్ మొక్కలా బలహీనంగా కని పిస్తున్న ఆ అబ్బాయిని తేరిపారజూస్తూ "నీది గూడా ఆంధ్రానేనా?" అని అడిగాడు మద్దులేటి.

"మాది మెడ్రాసే! కానీ కొంచుం కొంచు తెలుగు వస్తాది" అంటూ ముసముసి నవ్వులు నవ్వాడా అబ్బాయి..

"నిద్ర ముంచుకొస్తాంది. మరేమీ అనుకోకుండా నా బాగ్ కొంచెం చూస్తాండు నాయనా! నేనీ పక్క తలపెట్టుకుని కొంచెం నడుం వాలుస్తాను" అంటూ ముసలాయన పేవ్‌మెంట్ పైనే శరీరాన్ని సర్దుకున్నాడు.

జిప్ బాగ్ పైనున్న అడ్రస్సును "యస్.వెంక ట్రావు" అంటూ కూడి కూడి చదువుకున్న తర్వాత "గుడివాడ నించీ యింత దూరమేలొచ్చినావు పెద్దాయినా? హైద్రాబాదు దగ్గిర గదా మీకు?" అని అడిగాడు మద్దులేటి.

వెంకట్రావు కనురెప్పలు పైకెత్తి "హైద్రాబాదులో వీసాలిచ్చే అంబసీ యెక్కడుంది? భలే వాడివే! కంప్లీట్ సౌత్ యిండియాకంతా యిదొకటే గతి!" అంటూ మద్దులేటికేసి వోసారి ప్రశ్నార్థకంగా చూసి, మళ్లీ కళ్లు మూసుకున్నాడు.

విశ్రాంతి తీసుకుంటున్న రోడ్లకు నిద్రాభంగం కలుగుతుందేమోనన్న భయంతో అతి తక్కువ శబ్దం చేస్తూ పరతెంచిన లూనాపైన్నుంచీ వో కుర్రాడు కిందికి గెంతి "నీ వూటుకుపోయి తూంగుబో! నానింగ వుక్కారేన్" (నువ్వింటికెళ్లి నిద్రపో! నేనిక్కడ కూర్చుంటాను) అంటున్నాడు పది మంది కవతలున్న వ్యక్తితో. అక్కడ కూర్చున్న వ్యక్తి లూనాపైకెక్కి రోడ్లలో చీకటిని అన్వేషిస్తూ వెళ్లిపోయాడు. అతడు ఖాళీ చేసిన స్థలంలో ఆగంతకుడు సర్దుకుపోయాడు.

"యీ పేవ్‌మెంట్ ముళ్ల కంపలాగుంది" అని విసుక్కుంటూ ఆవులించి, యిక నిద్రరాదని నిర్ణ యించుకున్నట్టుగా "అయితే యెవరి కోసం యీ క్యూలో కూర్చున్నావు నువ్వు?" అంటూ మద్దులే టిని కబుర్లలోకి రాదీశాడు వెంకట్రావు.

మద్దులేటి చిరాకు పడుతూ అతడికేసి తిరిగి "అది సరే గానీ, నువ్వే స్టేట్‌కు పోతాండావు?" అని తానూ వో ప్రశ్ననే సంధించాడు.

"టెక్సాస్‌కెళ్లాలి. అక్కడ మా అమ్మాయి డాక్టరు..." తన పైన ఆమాత్రం అక్కర చూపెట్టే వ్యక్తి దొరకడంతో వెంకట్రావు వుత్సాహంతో చెప్పకుపోసాగాడు–"మా అల్లుడు కూడా డాక్టరే! యెంబీబియస్ చదివిన అమ్మాయి కోసం వెతికి వెతికి మా అమ్మాయిని పెళ్లి చేసుకున్నాడు. మా వియ్యంకుడూ వాళ్లుంటున్నది లాస్ యేంజెల్స్‌లో... వాళ్లకు గ్రీన్ కార్డుంది. యింతకూ వాళ్లు మన బందరువాళ్లే! యేడాది క్రితం మాకు మనవడు గూడా వుట్టాడు. మా అమ్మాయి వాడి ఫోటోలు కూడా పంపింది పోస్టులో. యెర్రగా బొద్దుగా యెంత బావున్నాడనుకున్నావ్?..."

"మనవడ్ని చూసొస్తామని అమెరికాకు పోతాం డావా?" ముసలాయన్ని మాటల్లో పెట్టడం కోసం అన్యమనస్కంగానే ప్రశ్నించాడు మద్దులేటి.

"పాస్ పోర్టొచ్చి పది నెలలై పోయింది. వీళ్లేమో వీసా యివ్వటం లేదు. మా అమ్మాయి గర్భవతవు తూనే వాళ్లమ్మని పంపమని రాసింది. పోయిన యేడాది యేప్రిల్ నెల్లో నా భార్య కూడా స్టేట్స్ కెళ్లిపోయింది. రిటయిరయ్యాక వెళ్దాంలే అని నేనాగిపోయాను. నేను లాస్ట్ ఆగస్టులో రిటయి

రయ్యాన్లే! అక్కడే హెడ్మాష్టరుగా చేసేవాణ్ణి! యింతలో యీ అమెరికా వాళ్లు పాలసీ మార్చే స్తారనీ, వీసా దొరకడం కష్టమైపోతందనీ వాకేం తెలుసు? డిసెంబ 'రులో వోసారి వీసా కోసం వచ్చానిక్కడికి. 'రీజన్స్ ఆర్ యినడిక్వేట్' అని తిప్పి పంపేశారు. యిప్పుడు మళ్లీ ప్రయత్నిస్తన్నాను. యీసారేమంటారో?!" కాస్సేపాగి మళ్లీ వెమ్మదిగా మొదలెట్టాడు వెంకట్రావు. "వున్నదొకే కూతురు. అదీ స్టేట్స్ కెళ్లిపోయింది. పెళ్లాం కూడా వెళ్లిపోయి యేడాది దాటింది. చుట్టూ బంధు వులున్నారన్న మాటే గానీ యెవరూ సమయానికి పలకరు. స్వయంపాకమే గతి. అందరూ వుండి గూడా వొంటరి బ్రతుకైపోయింది. యీ దేశంలో యింతమందున్నారు నా వొక్కగానొక్క కూతురు మాత్రం యిక్కడ చోటు దొరక్కపోయినట్టు అమె రికాకెళ్లిపోయింది. కూతురి బిడ్డను చూసుకోడం కోసం నా భార్య కూడా వెళ్లిపోయింది. సరే నేనూ




పోతాను బాబూ అంటే యీ అంబసీ వాళ్లు వినటం లేదు. నేను వెళ్లి అక్కడే సెటిలయిపోతానని వాళ్ల అనుమానమట! వొకవేళ సెటిలయిపోయినా వీళ్ల సొమ్మేం పోయింది? నేనొక్కడు అమెరి కాకు బరువైపోయానా చెప్పు?" యెండుటాకులపై వేడి గాలి పోకినట్టుగా జీరబోయిన వెంకట్రావు గొంతుక కీచుకీచుగా పలికింది. "వీసా దొరగ్గానే ఫోన్ చెయ్యి, టికెట్టుకు డబ్బు పంపుతానని రాసింది మా అమ్మాయి. మా డబ్బుతో మేం వెళ్తామంటే వీళ్ళొప్పుకోటం లేదు. అమ్మ లేకపోతే బేబీ సిట్టర్‌కు

బోలెడంత తగలెయ్యాలంటుంది మా అమ్మాయి. వాళ్లక్కడ. నేనిక్కడ. మధ్యలో యినపతెర మాదిరిగా యీ వీసా...

సముద్రం నుంచీ తప్పించుకొచ్చిన పిచ్చిగాలొకటి నానా రబస చేస్తూ క్యూ నొక్కసారి వూపి పారేసింది. నిద్రలో తూగుతున్న వాళ్లు కొందరు యేం జరిగిపోయిందోనని వులిక్కిపడి కళ్లు తెరిచి తమ తమ సామాన్లని గుండెలకేసి అదుముకోసాగారు. క్యూలో కబుర్లు చెప్పకుంటూ కూర్చున్న కుర్రాళ్లు కొందరు వాళ్ల తాపత్రయాన్ని చూసి పడీపడీ నవ్వసాగారు. చెట్లపైన్నుంచీ మంచు బిందువులతో బాటూ యెండుటాకులు గూడా జలజలా కిందికి రాలాయి. పాత దినపత్రికొకటి అంబసీ గోడపైని యినుప కమ్ముల్లో తగులుకుని చీలికలు పేలికలుగా చినుగుతూ జెండాలా రెపరెపలాడుతోంది.

యెంత ప్రయత్నించినా ఆగకుండా నిద్ర ముంచుకొస్తోంది మద్దులేటికి తూలి పక్కనున్న అబ్బాయి పైన పడ్డాడు. ఆ అబ్బాయి విసుగ్గా నెట్టడంతో వులిక్కిపడి కళ్లు తెరిచాడు. రెండు చేతులతో ముఖంపైన రుద్దుకుంటూ ఆవులించి, నిద్రనావుకోడానికి మాటల్లో పడడమొకటే మార్గాంతరమని స్ఫురించడంతో "నువ్వే స్టేట్‌కు పోతాండావు?" అని ఆ అబ్బాయినే అడిగాడు.

"హోస్టన్ యూనివర్సిటీలో యెంటెక్‌లో జాయిన్ అవనుపోతా వుండాను" అంటూ అతను తన చేతుల్లోని ఫైలును మరింత గట్టిగా పట్టుకున్నాడు.

"యిక్కడెక్కడా యెంటెక్‌లో సీటు దొరకలేదా?" అని ప్రశ్నించాడు మద్దులేటి.

అతనో చిరునవ్వు నవ్వి "దొరికితే మట్టుం యెపుడు చేరేది? యిక్కడ స్టడీసంతా యీజులెస్... వొకవేళ డిగ్రీ వచ్చినా జాబ్ గారెంటీ లేదు. అమెరికాలో స్టడీస్‌లో వుండంగానే జాబ్ దొరకతాది. మెరిట్‌కు వాల్యూ వుండాది. మంచి వొరుంబడి. కంఫర్టబుల్ లైఫ్. యిక్కడేముండాది? కరప్షనూ నెపోటిజమూ!" అన్నాడు.

"అక్కడ సీటెట్ల దొరికింది?"

"టోఫెల్ పాసయినాక యెనిమిది యూనివర్సిటీలకు అప్లయి చేసినాను. హోస్టన్‌లో సీటొచ్చింది.."

"స్కాలర్‌షిప్ప యిచ్చినారా?"

"యిప్పుడేమీ యీలేదు. కానీ అక్కడికి పోయినాంక స్కాలర్‌షిప్పేదయినా గ్రాంటవతింది. రాకపోయినా ప్రాబ్లం లేదు. పార్ట్ టైం జాబ్ దొరికితే మెయిన్‌టెన్సుకు సరిపోతింది. యిప్పుడు విమానం టికెట్లకూ, ఆరు నెల్ల దాంకా సస్టయినింగ్‌కూ కొంచెం ఖర్చు పెట్టుకోవాల్ల..."

"యెంతయితింది? వొక పది వేలు సరిపోతిందా?"

అతను విస్తుపోతూ "పాస్‌పోర్టుకూ వీసాలకే చానా అయింది. టికెట్టుకే ముప్పయి వలభై వేలు అవతాది. బ్యాంకులో త్రీ లాక్స్ అకౌంటు చూపించాల్ల..." అన్నాడు.

"అంటే నువ్వమిరికాకు పొయ్యేదానికి మూడున్నర లక్ష దాంకా ఖర్చు పెడతాండావా? మీనాయినేం చేస్తాడు? యాపారమా?..." మద్దులేటి కళ్లార్పడం సైతం మరచిపోయి అతనివైపే చూస్తూ అడిగాడు.

**హోస్టన్ యూనివర్శిటీలో ఎంటెక్‌లో జాయిన్ అవను పోతా వుండాను అంటూ అతను తన చేతిల్లోను ఫైలును మరింత గట్టిగా పట్టుకున్నాడు.**

"కాదు... బ్యాంకిలో క్లర్కు..."

"అయితే కష్టమేనే! యింత లెక్కెట్ల రెడీ జేసినాడు?"

చలనం లేని చెరువులా కనిపిస్తున్న మదరాసు ఆకాశంలో తక్కువ యెత్తులో యేదో విమానమొకటి యీతకొడుతున్నట్టుగా సాగిపోతోంది. మిడత కమగుడ్ల లాంటి దీపాల్ని అటూయిటూ వూపుకుంటూ. క్యూలో కాస్త దూరంలో స్వెట్టరు తొడుక్కుని తలపై పోల్డరు హేటు పెట్టుకున్న యాభైయ్యేళ్ల వ్యక్తి–చూడగానే ధనవంతుడని తెలిసిపోతున్నవాడు–ఖరీదైన పొగచుట్టను తగలేస్తున్నాడు. పొగాకు వాసన తెరలుతెరలుగా ముంచుకురాగా యిద్దరు ముగ్గురు ఖణేలు ఖణేలుమని దగ్గుతున్నారు.

త్రోసుకొస్తున్న పొడి దగ్గును అణచుకునే ప్రయత్నం చేస్తూ టీ షర్టు కుర్రాడు అన్నాడు–"మా సెకండ్ సిస్టర్‌కు లాస్టియరే మారేజయింది. యింకా డెట్సుండాయి. కానీ-మా ఫాదరు కొంచుం గూడా బేజారు పళ్లేదు. బ్యాంకు వన్ లాక్ దాంకా లోనిచ్చింది. మా నేటివ్ ప్లేస్ కనకమ్మ సత్రం–తిరుత్తణికిట్టల్ కేయమ్స్–లో ఫైవ్ యేకర్స్ వెట్ లాండ్ వుండాది మాకు. దాన్ని అడమానం పెట్టిండాం. మా ఫాదరిప్పుడు త్రీ థౌజండ్స్ దాంకా నెలనెలా యింట్రస్టు గట్టాల. రిటయిరవంక వచ్చే అమౌంటుతో అంతా క్లియర్ చేసేస్తానంటా వుండారు. కానీ నేనే వొప్పుకోలేదు. స్టేట్స్‌లో రెండేళ్లు జాబ్ చేసినానంటే అంతా నేనే క్లియర్ చేసూడస్తాను. పాపం, మా ఫాదర్‌కు మావల్ల యెప్పుడూ ప్రాబ్లమ్సే! జాబొచ్చినాంక అమౌంట్ పంపించి ఆయనను బాగా రెస్టెత్తుకోమని చెప్తాను..."

* * *

"ఆరుమూరైనా, మూరు ఆరైనా రొంత తావు గూడా యిచ్చేలే! కర్రోళ్ల వల్లన్న కొడుకు కర్రోళ్ల మద్దయ్య యిట్ట బుడ్డ బెదిరింపులకంతా బెదిరి పొయ్యేదిలే! వూరువూరంతా వొక్కటై పైనబడినా జంకేదిలే. సై అంటే సై..." వూరింటి మట్టి గోడపైన వాలిపోయి, రొప్పతూనే నలువుకంటే తెలుపే యెక్కువగా కనిపిస్తున్న బవిరి మీసంపైన చెయ్యేసాడు మద్దయ్య.

దాదాపు ఆరడుగుల వ్యాసార్థంతో కట్టిన వూరి గుడిసెలో నాలుగైదు మట్టి బానలూ, రెండు మూడు సత్తు గిన్నెలూ, వొక రంగుపోయిన ట్రంకు పెట్టే, దండెంపైన కొన్ని గుడ్డ పేలికలూ తప్ప మరేమీ లేవు. మట్టి పొయ్యికి రెండు మూడు రోజులుగా వేడి సోకిన ఆనవాలేమీ లేదు. పాత బొంతపైన ముడుచుకుని పడుకున్న పదేళ్ల మద్దులేటి బిక్కమొహం పెట్టుకుని చూస్తున్నాడు.

పాత కొబ్బరి చిప్పలోంచీ ఆముదం తీసి మద్దయ్య వీపుపైన తగిలిన దెబ్బలకు రాస్తూ "నీకీ బుద్ధి వూరికే రాలే! యింటికీ పెంటకూ తెచ్చేదాంకే వచ్చింది" అంటూ యేడుపును బిగవొక్క ప్రయత్నం చేసింది సుబ్బమ్మ.

"చత్... నోర్ముయ్! అయిందానికీ కానిదానికీ బొరోమని యేడ్చేదానికి నేనేమీ గాజులేసుకోలే..." మద్దయ్య విసుక్కున్నాడు. "యీ పెద్దరెడ్డి వొక్కడు కూతకి పిలవకంటే లోకమంతా గొడ్డు బోతాందా? రెక్కల కష్టంపైన బతకతాండాము. వొక్కటికి బయపడి నడవాల్సిన గాచ్చారంలే. యీ పని లేకపోతే ముగ్గురాయిపని. అదీ లేకపోతే గుల్లగొట్టేపని..."

"నీకు చెప్పీ చెప్పీ నా నోరేపోతాంది. నీకీ దినం మళ్లీ చెప్తాండాను" సుబ్బమ్మ బొంగురుపోయిన గొంతుకతో చెప్పసాగింది. "తొండాకిలు గుడ్లు బెట్టే ఆ రెండెకరాల చేను మనకున్నా వొకటే లేకపోయినా వొకటే. యీ సుడిగాట్లో వానలూ వంగుడులూ వచ్చేలే. సేద్దం జేస్తే యిత్తనాల కాయలు గూడా దక్కే ఆశలే. యీ పక్కంతా నేలలో ముగ్గురాళ్లుండాయని పెద్దరెడ్డి కొమగోలు చేస్తాండాడు గానీ లేకపోతే యీడెవురూ మూజ్జు తరు. అందరికీ యిచ్చేకంటే చానాగానే యిస్తానని అటాండాడు. చుట్టూ యింకో మడిస్కి యెడిసిపెట్టకుండా నేలలంతా జవురుకునేస్తాండాడు. మనమొకరం రెండెకరాల తోక మిగలబెట్టుకోని మిట్టనబడేది లేదీ! నా మాటిని వచ్చిందేందో తీసుకోని పెద్ద రెడ్డికే రాసిచ్చెయ్యి".

"నోర్ముయ్ సింపిరిమూ...." మూర్చరోగి శరీరంలా మద్దయ్య వొళ్లు తుళ్లి పడసాగింది. "వుండేది నోరులేని మొగబిడ్డలిద్దురు. మాయబ్బ నాకేమిచ్చి పోయినాడని అడిగితే తలెక్కడ పెట్టుకోమంటావే ధగ్గిడీ! మా తాతల కాలలం నించీ వస్తాండే నేల. పండేదో, పండందో, లెక్కవస్తాందో లేదో దాంతో నీకవావస్సం. దావుగా తలా యెకరానేలుంటే బిడ్డలకెంత ధయిర్నం నాలుగ్గింజలు జల్లితే, రొండు చినుకులు రాలితే, బిడ్డాబిసురూ తినేదానికి పిడికెడు ఘంట యింటికొస్తే ఆమాత్రం సాలు నాకు. నా చేన్లో నష్టమే వచ్చినా నాకు కష్టంలే. మద్దెలో

నాకిచ్చెయ్యమని అడిగేకి వాడెవుడు? యింతికింత యవహారం జరిపించివా కట్టు కదిలేదిలే. నా బిడ్డలకు దక్కాల్సిన నేల యిది. యెవురెట్ల యెగరేసకపోతారో మూజ్జస్సా!"

"యీ మాదిరి యితండంగా మాట్లాడి మిట్టూరికాడికిపొయ్యి గుల్ల పనిజేస్తివి. యేమయింది? ఆ వక్కేందో దోపిడీ జరిగితే నిన్నెత్తుకోని పొయ్యి వెల దివాలు పోలీసుటేషన్లో యేసి వూరికేనే రగత మొచ్చేట్లు కుళ్లబొడిసేసిరి. యిదంత యేల జరగతాందో నీకు తెలవాటంలే. నూర్లు మార్లుగా యెకరాలెకరాలుండే పెద్దోళ్లతో రచ్చలు పెట్టుకునేకి మన వల్లయితిందా? కొడుకుల మింద పెద్ద బ్రెముండే మడిసి మాదిరి నీలగతాండావు. యిదంతా తెలివై నోడు జేసే పన్లేనా చెప్పు?"

"పోలీసులంటే బయపడి చస్తానమకుంటాం డేమో పెద్దరెడ్డి..." వాలిన శరీరాన్ని మరోవైపుకు తిప్పబోయి, తగిలిన చేయి నొప్పెట్టడంతో మూలుగుతూ అన్నాడు మద్దయ్య "మిట్టూరు రోడ్డు పని జేసినప్పుడు వాలుగు వేలు దాంకా మిగలబెట్టుకున్నెట్టు పోవిడీ దెలిసింది పెద్దరెడ్డికి. దాన్నెట్టయినా కొట్టెయ్యమని అందుర్నీ యెగదోలతాండాడు. సటపటంగా లొంగేదిలే. వెలదివాలు టేషన్లోనే పెట్టుకోని పోలీసులు మాత్రం కేసు పెట్నారా? యేమీ చెయ్యలేక యింటికే అంపించలా?..."

గుడిసె బయటి నుంచీ నాలుగు కట్టె పేళ్లు తెచ్చి పొయ్యిలో మంట మండించే ప్రయత్నం చేస్తూ "పదిరవై యెకరాలుండే కాపోల్లే యేలి ముద్రలెయ్యమన్న చోట యేసేసి, యిచ్చిన లెక్క దీసుకోని, దక్కిందాంతో సంతోషపడతాండారు. మవ్వే మాదిరిగా తలగొట్టినట్టుగా యెదురు తిరిగితే అంత పెద్దోడికి కోపం రాదా?" అంటూ నిలదీసింది సుబ్బమ్మ. "వూళ్లో అందురికీ ఆకీనేరు చెరువు పక్కన పెంకులిండ్లు కట్టిస్తానని చెప్తాండాడు గదా పెద్దరెడ్డి. మొన్నెప్పతో అయిదారిండ్లకు కడగాలు గూడా యేసినారని అందురూ అంటాండారు. మనం గూడా మంచిగా వుంటే మనకూ వొకిల్లు యిస్తాడు. పనికిరాని పౌరుషానికి పొయ్యి అంతా నష్టమే తలకెత్తుకుంటాండావు. పెండ్లాం బిడ్డల మేలు జూసే మొగేడెవుడైనా యీ పని జేస్తాడా?..."

నీరసంతో మూసుకుపోతున్న కనురెప్పల్ని బలవంతంగా తెరిచి "పెద్దరెడ్డి యేరవ నీకు తెలీలే!" అంటూ మూలగసాగాడు మద్దయ్య. "ముగ్గురాల ప్లేట్లు యీ పక్కంతా వుండాయి. మన యింట్ల కాడ కూడా నేల పెళ్లగించి పారేయాలని మనల్ని వూరిడిసి. పెట్టి పొమ్మంటాండాడు. కూలీవాలీ జేసుకోని మిగలబెట్టుకున్న లెక్కతో బండీ యెద్దులూ బేరం జేసినావని కండ్లల్లో నిప్పులు బోసుకుంటాండాడు. వూర్లో యెవురూ బండి బాడిగకు పిలవకుండా అడ్డం పడతాండాడు. సిద్దాంటం కాయల్ని బేరం జేసి రాజంపేటకు తోలుకోనిపోతే మండీలోల్లకంతా పోన్లు జేసి యెవుర్నీ బేరం జెయ్యనీలే! బస్టాండు కాడ నేనే అమ్మకం జేస్తి. సరుకు బండ్ల కొండికీ దిగి రేటు పడిపోయింది గానీ లేకపోయుంటే యిన్నూరు దాంకా మిగిలుండు. నాలుగు చినుకులు రాలి, రొండు దినాల దాంకా కాయలు బండిపైన్నే వుండి సగానికి సగం కుల్లిపోయినాయి. లేకపోయుంటే పెట్టిన లెక్కలో సగమయినా దక్కుండు. నాకంతా తెలస్తాందిలే! బండి వూరికే యిరిగిపోతిందా? యెవుడో మాద ర్రేడ్ కట్టెచీల తీసేసింటాడు. లేకపోయింటే ఆ మాదిరిగా బండిరిసు వొంగిపోదు. బండితో గూడా నేను గూడా యేడయినా గుంతలో పడి కాళ్లిరగగొట్టుకుంటావని అనుకోంటాడు. నేనంత తేలిగ్గా యిడిసిపెడతానా బాంచెత్..."

పొగ చూరిన పాత మట్టి పాత్రనొకదాన్ని పొయ్యి మీదికెక్కించి, దాని నిండా నీళ్లు పోసి, పొగ చుట్టుకుంటున్న కట్టెల్ని రగిలించడం కోసం వూదుబుర్రతో గాలి వూదుతూ "యిక్కన పక్కనోళ్లంతా మన మాలోల్లకు యవసాయం అచ్చిరాదని చెవల్లో జోరీగల మాదిరి గీపెడతాండారు. కాపోల్లలతో మంచిగా వుండి, వాళ్లిచ్చే దాంతో జీవనం గడపాల్సి నోళ్లం. వాళ్లతో యిరోదం మంచిది గాదు..." అంది సుబ్బమ్మ.

"పొరంబోకు వాయాడ్లాంతా తెలివి లేకండా యెగజూసుకోండారు గాబట్టి నిన్నీ మొన్న దాంకా రైతుల యెనకాల చేతులు గట్టుకోని తిరిగినోడు దడీల్మసి పెద్ద రెడ్డయిపోయె. యీ పక్క నేలల్లొంతా ముగ్గురాళ్లుండాయని తెలుసుకోని, గోవర్మెంటోళ్ల కాళ్లు పట్టుకోని, దొరికిన నేలంతా సాధీనం జేసుకుంటాంటే యెవుడైనా కుయ్‌కయ్‌మనినారా? వొక మడిసికి, వొక కుటుంబరానికి యెంత లెక్క గావాల్ల? వానికేమో వూరోళ్ల నేలంతా చాల్లే. నాకు రొంత భూముంటే వొస్తెలే. యిదేం నాయం? పెద్ద రైతులు చెరువుల దగ్గిరా, కీనేరు బాయిల దగ్గిరా యవసాయం చేసుకుంటాండారు. కొండ కింద యెవురికీ కాబట్టిన నేలల తొక్కితొసికి, దున్నీ గిన్నీ, రాళ్లూ రప్పలూ పగలగొట్టి సదును జేసి, యేందో యీ కాలానికి వొక మాదిరిగా తీర్చిండాను. అది కూడా నాకు దక్కగూడదని ముంతపొగ పెట్టేటోన్ని వూరికే యిడిసి పెడతనా?..." పొయ్యి పక్కనున్న పాత ట్రంకు పెట్టెను గమనించి, కాస్సేపు మాట్లాడడం ఆపి, ఆతర్వాత "పెద్దోడొచ్చినాడా?" అని అడిగాడు మద్దయ్య.

కుండ అడుగులో మిగిలిన బియ్యాన్ని బాటలోకి వూడ్చిపోసుకుంటూ వచ్చాడన్నట్టుగా తల వూపిందామె.

"పరీక్షలయిపొయినాయంటనా?" ప్రశ్నించాడతను.

"బో పరీక్షలు. బాగా సదువు రాలేదని అంపించేసినారు. యింక సదువూ లేదు యేమీ లేదు తీ..." మూతి ముడుచుకుంది ఆమె.

"అదెట్ల అంపించేస్తారు? గవర్మెంటు ఆస్టల్లో పరీక్షలయిపొయిందాంకా అంపించే రూలులే! పెద్దరెడ్డి ఆ వార్డేనుతో గూడా యేమయినా చెప్పింటాడు..."

మద్దయ్య అతి కష్టంపైన లేచి నిల్చున్నాడు. మోకాలిపైన కట్టిన కట్టులోంచీ గడ్డకట్టిన రక్తం రబ్బరులా పలచగా సాగింది. మాసిన పంచ తప్ప మరో ఆచ్ఛాదన లేని అతడి నల్లటి శరీరం కమిలిన గాయాలతో సగం కాలిన కొరివి కట్టెలాగుంది. గుడిసె బయట పందిరి కింద పడుకుని నెమరేస్తున్న యెద్దుల దగ్గరికొచ్చి నిల్చున్నాడతను. డొక్కలు బయటపడి సన్నగా బలహీనంగా కనిపిస్తున్న యెద్దులు రెండూ యింకా మూల్గుతూ జాలి చూపుల్ని సారిస్తున్నాయి. వాటి కాళ్ల మడతల్లో రాసిన ఆకు పసరులోంచి యింకా రక్తపు చుక్కలు రాలుతూనే వున్నాయి. మద్దయ్య కళ్లల్లో నీళ్లు తిరిగాయి. "ఆ ఆచారి దగ్గరికి యిరిగిన బండిని చేర్పించే దాంకే మిగిలిన లెక్కంతా అయిపోయింది. యింక దాన్ని ఆరువు చేసేదాంకి యెంత గావాల్నో?!" అని గొణుక్కుంటూ గుమ్మం దగ్గరికెళ్లి "చిన్నోడ్ని అంపించి పెద్దోణ్ణి తొడుక్కోని రమ్మని చెప్పు ఆ వార్డేను సంగతేందో తెల్సుకుందాం. నేనట్ల చేసుదాంకా పాయొస్తా. నిన్న రొండ తుంపర రాలింది. దున్న కానికి సరిపోతిందో లేదో సూసొస్తా!..." అంటూ మాట్లాడుతూనే రోడ్డు పైకెళ్లిపోయాడు.

వోబులేసు కోసం వూరిలోని ప్రతి యిల్లూ తిరిగి చూశాడు మద్దులేటి. రచ్చబంట దగ్గరికెళ్లాడు. పాడుబడ్డ మిల్లు దగ్గర వెతికాడు. కూలిన సత్రం గోడల దగ్గర గమనించాడు. దాదాపు రెండు మూడు గంటల ప్రయత్నం తర్వాత యెండిన చెరువు పక్కన, వాడిన చెరుకు తోట మధ్యలో, గెనిమల మధ్య వొదిగి వొదిగీ కూర్చుని తన యీడు పిల్లలతో పేకాడుకుంటూ కనిపించాడు వోబులేసు.

(ఇంకా వుంది)

"మద్దయ్య అతి కష్టం మీద లేచి నిల్చున్నాడు. మోకాలి పై నుంచి కట్టిన కట్టులోంచి గడ్డకట్టిన రక్తం రబ్బరులా పల్చగా సాగింది".